# ధాన్యం కొనుగోళ్లు @ 42 కిలోలు..

▪తూకం తగ్గేదే లేదు.. ▪తలలు పట్టుకుంటున్న రైతన్నలు.. ▪బహిరంగంగా అన్నదాత నిలువు దోపిడీ





**శెనార్తి మీడియా, కరీంనగర్/మంచిర్యాల ఆదిలాబాద్:**

ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ధాన్యం పండించేందుకు రైతన్న ఎంత కష్టపడ్డాడో.. దానిని అమ్ముకునేందుకు రెట్టింపు కష్టపడాల్సి వస్తోంది... నిన్న మొన్నటి వరకు పంట ఆఖరు వరకు తడి ఇచ్చేందుకు నీటి కోసం అరగోస పడ్డ రైతన్న ఎట్టకేలకు పంటను కాపాడు కొని.., కోతకోసి.. ఆరబెట్టి.. ఇప్పుడు ఆగమాగమైతండు. రైతులు పండించిన పంటకు సవాలక్ష సాకులు చూపుతున్న మిల్లర్లు సివిల్ సప్లయ్ కి ఇచ్చే ధాన్యం నాణ్యమైనదే ఇస్తున్నారా..? అంటే అది ఏ మాత్రం లేదు. అలాంటప్పుడు రైతులకే ఎందుకు ఇన్ని కండీషన్లతో కోతలు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు.

**తూకం 42 కిలోలకు తగ్గేదే లేదు...**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ఆరినంక తూకం వేసి మిల్లులకు తరలించాల్సి ఉంటుంది. ఇక్కడే రైతన్నను నిలువునా ముంచుతుండ్రు. ఎంత మంచిగా ఉన్న తాలు, తప్ప అంటూ లేనిపోని షాకులు చూపుతూ 40 కిలోల బస్తాకు రెండు కిలోలపైన అంటే 42 కిలోల పైగ తూకం వేస్తూ రైతులను నట్టేట ముంచుతుండ్రు. ధాన్యం ఎంత మంచిగా ఉన్నతూకం తగ్గేదే లేదు.. ఒప్పుకోకుంటే కుప్ప ముట్టేదే లేదు.. నానా తంటాలు పడి కాంటా పెట్టిస్తే లారీ అన్ లోడ్ అయ్యేదే ఉండదు. ఇగ రైతన్న చేసేదేం లేక మిల్లర్లు చెప్పినట్టు తల ఊపి కోతకు ఒప్పుకొని వచ్చుడే తన వంతవుతుంది.

**తలలు పట్టుకుంటున్న రైతన్నలు...**

ఓ వైపు భానుడి ప్రతాపంతో ఎండలు 42 డిగ్రీలు దాటి దంచి కొడుతుంటే ఓర్చుకొని పని చేసుకుంటున్న రైతన్న మిల్లర్లు బస్తాకు 42 కిలోల పైన తూకం వేస్తుంటే తట్టుకోలేక కనిపించని ఆ దేవుడి కోసం మబ్బులవైపు చూసుడే దిక్కవుతుంది. తలలు పట్టుకొని ఆకాశంవైపు చూస్తు రైతులను ఆదుకునే దేవుడి కోసం ఎదురు చూస్తున్నారు. బహిరంగంగానే నిలువు దోపిడీకి గురవుతున్నారు. అధికారులైనా రైతులకు దేవుడిలా మారుతారంటే ఇలా వచ్చి.., నాలుగు మాటలు మాట్లాడి అలా వెళుతున్నారే తప్ప అధికంగా ఎందుకు తూకం వేస్తున్నారంటూ అడిగిన నాథుడే కరువయ్యారు. పైగా మిల్లర్ కు సపోర్టుగా ధాన్యంతో తాలుందని, తూర్పార పట్టాలంటూ ఉచిత సలహాలిస్తున్నారే తప్ప రైతుకు అండగా నిలువడం లేదని వాపోతున్నారు.

# అంబేద్కర్ ఆశయాలను కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తున్నది

**కాంగ్రెస్ఆదిలాబాద్పార్లమెంట్ఇన్‌చార్జి ఆత్రం సుగుణ**

**ఆదిలాబాద్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచణలను ముందుకు తీసుకుపోయేది కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మాత్రమేనని ఆ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అ న్నారు. 134వ అంబేద్కర్ జయంతి సందర్భంగా జైనూర్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సుగుణ పాల్గొని, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం ..దేశ అభివృద్ధి కోసం, బీద బడుగు వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారు. ఆయన రూపొందించిన రాజ్యాంగం ప్రకారమే ఈరోజు మనం స్వేచ్ఛగా బతకగలుగుతున్నామని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అంబేద్కర్ ఆశయాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్ ను అవమానపరిచేలా వ్యాఖ్యానాలు చేసిన విషయాన్ని సుగుణక్క ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ల వ్యవస్థను కూడా రద్దు చేసేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ వాదులు అంబేద్కర్ భావాలను ముందుకు తీసుకు వెళుతున్నారన్నారు. ఇందులో భాగంగానే గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామ గ్రామాన అంబేద్కర్ జయంతి వేడుకలను కన్నుల పండుగ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో అంబేద్కర్ జయంతి అసోసియేషన్ అధ్యక్షుడు బాబాసాహెబ్ కంబ్లె, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కూడ్మేత విశ్వనాథ్, కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ ముఖిత్, భరత్ వాగ్మారె, మాజీ గ్రంథాలయం చైర్మన్ కనక యాదవ్ రావ్, కొడప హన్ను పటేల్, జంగు బాబు, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలం నాయకులు, అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.






# గంజాయిపై ఉక్కుపాదం

• ఇచ్చోడ మండలంలో 180 గంజాయి మొక్కలు స్వాధీనం
• నలుగురిపై కేసు నమోదు, అరెస్ట్.. • ఎస్పీ అఖిల్

**ఆదిలాబాద్ :** గంజాయిపై ఉక్కు పాదం మోపాలని, జిల్లాలో గంజాయి మాదకద్రవ్యాలను పూర్తిగ రూపుమాపాలనే లక్ష్యంతో పోలీసు యంత్రాంగం అహర్నిశలు కష్టపడుతూ ప్రజలకు మంచి సేవలందిస్తున్నదని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం ఇచ్చోడ మండలం సల్యాడ గ్రామంలో అక్రమంగా పంట పొలాల మధ్యలో గంజాయి మొక్కలు పెంచుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్పీ ఆదేశాల మేరకు సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి, నలుగురి పంట పొలాలలో 180 గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఎస్పీ, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ తో కలిసి స్థానిక పోలీసు స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. స్వాధీనం చేసుకున్న 180 గంజాయి మొక్కల విలువ రూ.18 లక్షలు ఉంటుందన్నారు. ఇచ్చోడ మండలం సల్యాడ గ్రామానికి చెందిన చహకటి సోనేరావు వద్ద 17 గంజాయి మొక్కలు, దుర్వా లవకుష్ వద్ద 86 గంజాయి మొక్కలు, అర్క జంగుబాపు వద్ద 31 గంజాయి మొక్కలు, దుర్వా అరుణ్ వద్ద 46 గంజాయి మొక్కలు దొరికాయన్నారు. వీరి నలుగురిపై కేసులు నమోదు చేశారన్నారు. జిల్లాలో గంజాయి సరఫరాదారులను, వర్తక దారులను, వినియోగదారులను, కనుగొనడంలో ప్రత్యేక బృందాలను ఏర్పాట చేశామన్నారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేకంగా ఏడీబీఎన్ఏబీ ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఎలాంటి సమాచారాన్ని అందజేయాలన్నా మెసేజ్ యువర్ ఎస్పీ నెం.8712659973ని వినియోగించుకోవచ్చన్నారు. గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకోవడంలో కష్టపడ్డ సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ఇచ్చోడ సీఐ భీమేష్, ఎస్ఐ తిరుపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి సరఫరా చేస్తే చర్యలు

**నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా**

**ఆదిలాబాద్:** మాదకద్రవ్యాల సరఫరా, గంజాయి తాగడంలాంటివి చేయకూడదని ఏఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. సోమవారం రాత్రి 10గంటల సమయంలో నర్సాపూర్ మండలం తిమ్మాపూర్, నర్సాపూర్, చాక్ పల్లి గ్రామాల్లో పక్కా సమాచారంతో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పలువురు అనుమానితుల ఇండ్లలో సోదాలు చేశారు. యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఎవరైనా రాత్రి సమయంలో గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం ఉంటే నిర్భయంగా పోలీసులకు సమాచారం అందించాలని ఏఎస్పీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల నియంత్రణ గంజాయి రహిత సమాజ నిర్మాణం కోసం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ సీఐ కృష్ణ, ఎస్సై సాయికిరణ్, సారంగాపూర్, దిలావర్పూర్ ఎస్సైలతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జోరుగా జీరో దందా

▪ వే బిల్లులు లేకుండానే ధాన్యం తరలింపు
▪ అనుమతులు ఒక చోట..
నిలువలు మరో చోట

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో జోరుగా ధాన్యం జీరో దందా సాగుతోంది. ఎలాంటి వే బిల్లులు లేకుండానే ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ ఎలాంటి అనుమతులు లేకుండానే గోదాముల్లో నిలువ చేస్తున్నారు. ఇదంతా అధికారుల కండ్ల ముందే జరుగు తున్నా ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారంటే వారికి ఇది 'మామూలు'గా నడిచే వ్యవహారమని చెప్పకనే అర్థమవుతోంది.



**వే బిల్లులు లేకుండానే ధాన్యం తరలింపు**

ట్రేడింగ్ లైసెన్స్ పొందిన వ్యాపారులు రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయవచ్చు. అది కూడా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర తగ్గకుండా చెల్లించి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ఆ ధాన్యాన్ని వే బిల్లుతో మిల్లుకు లేదా గోదాములకు తరలించుకోవచ్చు. కానీ మండలంలో అలా జరుగడం లేదు. రైతుల వద్ద తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి వారి వారి ప్రైవేటు గోదాముల్లో నిలువ చేసుకుంటున్నారు.

**విత్తన సీడ్ పేరిట జోరుగా జీరో దందా**

మండలంలో సుమారు 24 వేల ఎకరాల్లో వరి పంట సాగయింది. ఇందులో 15 వేల ఎకరాల్లో సీడ్ విత్తనాలే సాగు చేశారు. ఈ సీడ్ విత్తనాలు సైతం సేకరించే సమయంలో ఏ రైతు వద్ద ఎంత కొనుగోలు చేశారో, అది ఎక్కడ నిలువ ఉంచారో వివరాలు సంబంధిత అధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది. కానీ మండలంలో ఇవేమి కానరావడం లేదు.

**ముడుపులిస్తూ.. మ్యానేజ్ చేస్తూ...**

మామూళ్లకు అలవాటు పడ్డ అధికారులకు వ్యాపారులు పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లిస్తూ 'మ్యానేజ్' చేసుకుంటున్నారనే ఆరోపణలు కోకొల్లలుగా వినిపిస్తున్నా యి. వ్యాపారులు ధాన్యం నిలువ చేసుకునేందుకు అను మతి ఒక చోట తీసుకొని మరో చోట నిలువలు ఉంచుతు న్నా రు. ఇలాంటి నిలువలను వ్యవసాయ, రెవెన్యూ అధికా రులు సీజ్ చేసే అవకాశం ఉన్నా అవేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. దీనితో వారి వ్యాపారం 'మూడు చోట్ల అనుమతి.., ఆరు చోట్ల నిలువలు' అన్నట్టు సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలా అనుమతి లేని, జీరో దందాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**అనుమతి లేకుండా నిలువ చేస్తే చర్యలు తప్పవు**

వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం (సీడ్ లేదా ఓపీ)ను అనుమతి తీసుకున్న గోదాముల్లోనే నిలువ చేయాలి. మండలంలో సోనం కంపెనీ మాత్రమే అనుమతి తీసుకున్నారు. ఎవరైనా అనుమతి లేకుండా గోదాముల్లో ధాన్యం నిలువ చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

**వెంకటేశ్, మండల వ్యవసాయ అధికారి, శంకరపట్నం**





# భవనంపై నుంచి పడి ముగ్గురు కార్మికుల దుర్మరణం

**తిరుపతి,ఏప్రిల్29 :** నిర్మాణంలో ఉన్న భవనంపై నుండి ప్రమాదవశాత్తూ పడి ముగ్గురు కార్మికులు మృతి చెందిన ఘటన మంగళవారం తిరుపతి జిల్లాలో జరిగిం ది. మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామ పంచా యతీ తుడా క్వార్టర్స్ హెచ్ఐజి ఫ్లాట్ నెంబర్ 63 లో 5 అంతస్తుల భవన నిర్మాణం జరుగుతుంది. భవన యజమాని అండాలయ్య జిపిఎస్ జీ ప్లస్ 3 కి అనుమతి తీసుకొని 5 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఉదయం నలుగురు మేస్త్రీలు భవనం 5వ అంతస్తు గోడకు పూత పని చేయడానికి వేసుకున్న బెడ్ కర్ర విరిగిపోవడంతో ఈ ప్రమాదం జరిగి ముగ్గురు కార్మికులు కిందికి పడిపోయి మరణించారు. విషయం తెలుసుకున్న తిరుపతి రూరల్ డీఎస్పి, ఆర్డీవో రామ్మోహన్, తిరుపతి అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, సిఐ సునీల్ కుమార్, సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చనిపోయిన ముగ్గురు కార్మికులు ఒంగోలుకు చెందిన వసంత్ (40), ఒంగోలు శీను (38), పెళ్ళకూరు మండలం, అక్క గారి పేట గ్రామం కు చెందిన బోటతొట్టి శ్రీనివాసులు (38) గా గుర్తించారు. 108 సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి కిందపడిన కార్మికులను పరిశీలించి వారు మృతి చెందినట్లు-గా నిర్ధారించారు.